మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



# కదం తొక్కిన పెద్ద ధన్వాడ



- వాహనానికి నిప్పు పెట్టిన ఆందోళనకారులు
- ఫ్యాక్టరీ సామగ్రి, టెంట్లు, కంటైనర్ బొలెరో వాహనం ధ్వంసం
- ఇథనాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా పోరు ఉధృతం
- జోగులాంబ గద్వాల జిల్లా పెద్ద ధన్వాడలో ఉద్రిక్తత

గద్వాల, మానవపాడు, జూన్ 4 ప్రభాతవార్త : జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి మండలం పెద్ద ధన్వాడ గ్రామ పరిధిలో ఇథనాల్ పరిశ్రమ చిచ్చు రాజేసింది. ఈ క్రమంలో బుధవారం మొత్తం 10 గ్రామాలకు చెందిన రైతులు మహిళలు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తూ పెద్ద ధన్వాడలో పరిశ్రమ ఏర్పాటు చేసే ప్రాంతానికి వెళ్లి వేసుకున్న టెంట్లను పీకేసి సామాగ్రిని ధ్వంసం చేశారు. ముందస్తు సమాచారంతో భారీగా మోహరించిన పోలీసులు ఆందోళనకారులను అడ్డుకునేందుకు యత్నించారు. ఈ క్రమంలో అడ్డుకున్న పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో తీవ్ర ఆగ్రహానికి లోనైన గ్రామస్తులు పనులు ప్రారంభించేందుకు వచ్చిన ఇథనాల్ ఫ్యాక్టరీ యజమాన్యంపై తిరగబడ్డారు. వారి కార్లతో పాటు ఇతర సామాగ్రిని ధ్వంసం చేసి వాటికి నిప్పంటించారు. గతంలో ఇథనాల్ ఫ్యాక్టరీ వద్దంటూ వ్యతిరేకంగా 12 గ్రామాల ప్రజలు నిరవధిక నిరసన ధర్నా కార్యక్రమాలు చేశారు. దీంతో కొద్దిరోజుల వరకు వివాదం సద్దుమణిగింది. బుధవారం తెల్లవారుజామున ఫ్యాక్టరీ నిర్మాణం కోసం గాయత్రీ కంపెనీ యజమాన్యం కంటైనర్‌తో పాటు ఫ్యాక్టరీ నిర్మాణం కోసం జెసిబిలు, కార్మికులను పెద్ద ఎత్తున పెద్ద ధన్వాడకు తీసుకెళ్లగా మరోసారి 12 గ్రామాలకు చెందిన రైతులు మహిళలు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. ఇథనాల్ పరిశ్రమ వద్దంటూ ప్రజలు నిరసన వ్యక్తం చేస్తూ మరోసారి పోరుబాట పట్టారు.



ఆందోళన చేస్తున్న దృశ్యం



ఆందోళన చేస్తున్న దృశ్యం

## పట్టణాభివృద్ధి కోసం పని చేయాలి

# అందరికీ అండగా ఉంటా

**100 రోజుల అవగాహన కార్యక్రమంలో వనపర్తి శాసనసభ్యుడు తూడి మేఘారెడ్డి**

**వనపర్తి ప్రతినిధి, జూన్ 4 ప్రభాతవార్త:** వనపర్తి మున్సిపాలిటీలో పనిచేసే అధికారులు సిబ్బంది అందరూ పట్టణాభివృద్ధి కోసం పని చేయాలని, వారికి ఎలాంటి ఇబ్బందులు ఉన్న అండగా ఉంటానని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. బుధవారం వనపర్తి మునిసిపాలిటీలో నిర్వహించిన 100 రోజుల కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. వార్డు అధికారులుగా, మెప్మా ఆర్పీలుగా, జవాన్లుగా, నిరంతరం వనపర్తి పట్టణ ప్రజలకు అందించే సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే వారిని అభినందించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి వనపర్తి జిల్లా కేంద్రంపై ఉందని త్వరితగతిన అభివృద్ధి చెందే వనపర్తి పట్టణాభివృద్ధిలో మీరందరూ భాగస్వాములు కావాలన్నారు. గతంలో మీరు ఎలా పనిచేశారన్నది పక్కకు పెడితే నేటి నుంచి నిబద్ధతతో పనిచేయాలని, విధినిర్వహణలో మీ దృష్టికి వచ్చేపొరపాట్లను నివృత్తి చేస్తూ, సమస్యలను పరిష్కరిస్తూ, ప్రజలకు ఉత్తమమైన సేవలు అందించాలని ఆయన సూచించారు. ముఖ్యంగా ఓటర్ లిస్ట్‌పై ప్రత్యేక దృష్టి సారించి నిజమైన పట్టణ ఓటర్లను గుర్తించి, డబల్ ఎంట్రీలు ఉన్న వాటిని తొలగించాలని ఆయన తెలిపారు. పని విషయంలో నిర్లక్ష్యం వహించరాదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, మధుసూదన్ రెడ్డి మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి

**సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచన**

వనపర్తి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి సందర్శించి కళాశాలలోని సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కళాశాల అధ్యాపకులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కళాశాల పూర్తిగా శిథిలావస్థకు చేరిందని, తరగతి గదులు, మరుగుదొడ్లు, ల్యాబ్‌గదులు, కంప్యూటర్ గదులు, పూర్తిగా శిథిలమైపోయాయని, నీటి వసతి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు తెలిపారు. మౌలిక వసతులు కల్పిస్తే నూతన భవనాలు నిర్మించే వరకు విద్యాభ్యాసాన్ని ఇక్కడే కొనసాగిస్తామని అధ్యాపకులు ఎమ్మెల్యే

– మిగతా4లో..

## అధికారుల నిర్లక్ష్యానికి

# నిండు ప్రాణం బలి

- ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి బాలుడు మృతి
- కంచె లేకపోవడంతో ప్రమాదం
- జడ్చర్ల సర్వసతీ నగర్‌లో ఘటన



శ్రేయాన్స్(ఫైల్)

**జడ్చర్ల, జూన్4, ప్రభాతవార్త:** విద్యుత్ శాఖ నిర్లక్ష్యంతో ఓ నిండు పసిప్రాణం బలైన ఘటన జడ్చర్లలో చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. జడ్చర్ల పట్టణంలోని సరస్వతీనగర్ కాలనీలో అన్నా తమ్ముళ్లు సైకిల్ తొక్కుతూ ఆడుకుంటూ ఉన్నారు. ఈక్రమంలో తమ్ముడు శ్రేయాన్స్ ముందు వెళ్లగా అన్న అదే రోడ్డులో వెనకాల వచ్చాడు. ఈ క్రమంలో సైకిల్‌పై వెళ్తున్న బాలుడు హఠాత్తుగా ట్రాన్స్‌ఫార్మర్ పడిపోవంతో షాక్ తగిలి కాంగ్రెస్ పార్టీ నాయకుడు బొక్క రాఘవేందర్ చిన్న కుమారుడు శ్రేయాన్స్ ప్రమాదానికి గురై మృతిచెందా డు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్త్‌వైర్‌కు కరెంట్‌తీగ తగిలిఉండడంతో ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. అయితే ట్రాన్స్ ఫార్మర్ వద్ద చుట్టూ ఫెన్సింగ్ లేకపోవడంతోనే ప్రమాదం జరిగిందని ఆరోపిస్తున్నారు. ఇప్పటికే పలు మార్లు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను కోరినా పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఓ పసిప్రాణం తీసుకోవడం జరిగిందని చెప్పారు. బొక్క రాఘవేందర్ తన సొంత ఖర్చులతో కంచే నిర్మాణం చేపడుతానంటే కూడా అధికారులు స్పందించలేదని పేర్కొన్నారు. ఆ కుటుంబానికి పసిప్రాణం ఎవరు తీసకొస్తారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ అధికారులపై వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# గడువులోగా సమస్యలు పరిష్కరించాలి

- భూ సమస్యల పరిష్కారానికే చట్టం
- కలెక్టర్ విజయేంద్ర బోయి
- చంద్రాస్‌పల్లిలో కలెక్టర్ పర్యటన

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్4, ప్రభాతవార్త:** భూభారతి ద్వారా అన్ని మండలాల, గ్రామాల్లో ఈ నెల 20 వరకు భూసమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ విజయేందిర బోయితెలిపారు. బుధవారం కోయిల్ కొండ మండలం చంద్రాస్ పల్లి గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో జిల్లా కలెక్టర్ పాల్గొని భూ సమస్యలపై దరఖాస్తులను పరిశీలించారు. రైతులు భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో పాల్గొనేలా అవగాహన కలిగించాలని అన్నారు, గ్రామ రెవెన్యూ సదస్సులు షెడ్యూల్ గురించి విస్తృతంగా గ్రామాల్లో తెలియ చేయాలని కలెక్టర్ సూచించారురైతులు, ప్రజలు భూ సమస్యలను పరిష్కారం చేసేందుకు గ్రామాల్లో నిర్వహించే భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో పాల్గొని దరఖాస్తులు అంద చేయాలని సూచించారు. రెవెన్యూ సదస్సులో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి దరఖాస్తు దారులకు ఏ విధంగా దరఖాస్తు పూరించాలి సూచనలు, సలహాలు అంద చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన దరఖాస్తులు నిర్దేశిత గడువు లోగా పరిష్కారం చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. అనంతరం చంద్రాస్ పల్లి గ్రామంలో పల్లె దవాఖానను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. పల్లె దవాఖానలో పరిధిలో ఎన్ని గ్రామాలు ఉన్నవి అని డాక్టర్, సిబ్బందిని అడిగారు ఐదు గ్రామాలు ఉన్నాయని తెలిపారు. గర్భిణులు ఎంత మంది నమోదు అయ్యారు. ఎంత మంది డెలివరీ కి ఉన్నారు అని కలెక్టర్ వైద్య సిబ్బందిని అడిగారు 33 మంది డెలివరీ ఉన్నారు హై రిస్క్ కేసులు ఎన్ని ఉన్నాయి అని అడగగా 8 హై రిస్క్ కేసులు ఉన్నాయని కలెక్టర్ కు తెలిపారు. అన్ని డెలివరీలు పక్కాగా డేటా సిద్ధంగా ఉంచాలని అన్నారు. మే నెలలో ఎన్ని డెలివరీలో అయ్యాయి మే నెలలో 7డెలివరీలు జరిగాయని తెలిపారు. గర్భిణులు, మాతా శిశు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మాతా, శిశు సంరక్షణ, గర్భిణీల చెకప్, హై రిస్క్ కేసుల చికిత్స తదితర అంశాలపై వారికి అవగాహన కలిగించాలన్నారు. అదేవిధంగా రక్త హీనత ఉన్న మహిళలకు కూడా ప్రత్యేక శ్రద్ధ కనబరచి చికిత్స అందించాలన్నారు. చిన్నపిల్లలకు టీకాలు వేసే కార్యక్రమం సక్రమంగా నిర్వహించాలి. డయాబెటిస్ పేషెంట్స్ ఎంతమంది ఉన్నారని అడిగింది డయాబెటి పేషెంట్స్ 78 మంది ఉన్నారు బీపీ పేషెంట్స్ 101 ఉన్నారు అని ఇంకా ఏమైనా ఇబ్బంది ఉందా మందుల కొరత ఏమైనా ఉందా అని తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ తో పాటు తహశీల్దార్, రెవెన్యూ, వైద్య సిబ్బంది ఉన్నారు.



పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న కలెక్టర్ విజయేంద్ర బోయి



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

## ధాన్యం సేకరణపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి

**నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్ 4 ప్రభాతవార్త:** కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని కోడేరు మండలం పరిధిలోని పస్పుల గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎంత ధాన్యం కేంద్రానికి వచ్చిందని కలెక్టర్ ఆరా తీశారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన టార్పాలిన్‌లు అందుబాటులో ఉన్నాయని, వర్షానికి వడ్లు తడిచిపోకుండా కప్పి ఉంచాలని కలెక్టర్ తెలియజేశారు. లారీల కొరత లేకుండా చూసుకోవాలని, తేమ శాతం 17 వరకు ఉన్నా వెంటనే తూకం వేసి లారీల్లో ఎక్కించాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన ప్రకారం రైతుల నుండి ధాన్యం పక్కాగా సేకరించడం జరుగుతుందని, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అన్ని సౌకర్యాలు కల్పించాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంట వెంటనే రైస్ మిల్లు లకు తరలించాలని ఆదేశించారు. వరి కొనుగోలు కేంద్రాలకు వచ్చిన రైతులకు పూర్తిస్థాయిలో భరోసా కల్పించాలని కలెక్టర్ సూచించారు. కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతుల ఖాతాలో

– మిగతా4లో..



వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

## జిల్లాకు 23 నూతన గ్రామపంచాయతీ భవనాలు

**హరితహారంలో అందమైన మొక్కలు నాటేందుకు కార్యచరణ**

**మండలంలోనీ ఒక గ్రామ పంచాయతీలో పైలెట్ ప్రాజెక్టుగా**

**ఇందిరమ్మ ఇళ్ళు: జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

**వనపర్తిటౌన్, జూన్ 4 ప్రభాతవార్త :** జిల్లాలో జాతీయ ఉపాధి హామీ పథకానికి సంబంధించిన మెటీరియల్ కాంపోనెంట్ పనులను త్వరగా గ్రౌండింగ్ చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం ఐడిఓసి సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఇంచార్జ్ యాదయ్యతో కలిసి ఉపాధిహామీ పథకము మెటీరియల్ కాంపోనెంట్ పనులపై సమీక్ష నిర్వహించారు. మెటీరియల్ కాంపోనెంట్ కింద వనపర్తి జిల్లాకు 23నూతన గ్రామపంచాయతీ భవనాలు, 11 కమ్యూనిటీ మరుగుదొడ్లు ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ యూనిట్లు రెండు, సిగ్రిగేషన్ షెడ్లు, కమ్యూనిటీ ఇంకుడు గుంతలు, స్వచ్ఛభారత్ కోష్ మంజూరు అయి ఉన్నాయని, వీటిని గ్రౌండింగ్ చేసేందుకు గ్రామ పంచాయతీలకు కేటాయించి స్థలం సేకరించే కార్యక్రమం పూర్తిచేయాలన్నారు. స్థలం నిర్ధారించాక పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓలను ఆదేశించారు వన మహోత్సవం వర్షాలు ప్రారంభం అయినందున ఈ సంవత్సరం హరిత హారంలో భాగంగా మొక్కలు నాటి కార్యక్రమంలో దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రతి గ్రామ పంచాయతీ ప్రధాన రహదారికి వచ్చి పోయే దారిలో 200 మొక్కల చొప్పున అందమైన మొక్కలు నాటేందుకు కార్యాచరణ ప్రారంభించాలని సూచించారు. గ్రామంలో ఎక్కడెక్కడ మొక్కలు నాటేందుకు అవకాశాలు ఉన్నాయో సైట్ లు గుర్తించి పెట్టుకోవాలని ఆదేశించారు. ఈ సంవత్సరము జిల్లాలో 44 కొత్త నర్సరీలు ప్రారంభించేందుకు లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందని వాటిని వెంటనే ప్రారంభించేందుకు ఆయాగ్రామ పంచాయతీల్లో చర్యలుతీసుకోవాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల ప్రతి మండలంలో ఒక గ్రామ పంచాయతీనీ పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని మొదటి విడతలో మంజూరు అయిన ఇందిరమ్మ ఇళ్లు త్వరగా గ్రౌండింగ్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓలను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లకు డబ్బులుసైతం వెనువెంటనే ఖాతాలో జమ చేయడం జరుగుతుందని లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. అవసరమైతే లబ్ధిదారులకు మండలంలో నిర్మించిన మోడల్ ఇందిరమ్మ ఇంటిని చూపించాలని సూచించారు. ప్రపంచ

– మిగతా4లో..

## భూ సమస్యల పరిష్కారానికి గొప్ప వేదిక భూభారతి

- నూతన రెవెన్యూ చట్టం.. భూ భారతి చట్టం అమలులో కీలకంగా రెవెన్యూ సదస్సులు...
- ప్రతి భూ దరఖాస్తుపై అధికారులు తక్షణ స్పందన చూపాలి...
- జూన్ 20 వరకు ప్రతి రెవెన్యూ గ్రామంలో భూ సమస్యల పరిష్కారానికి సదస్సులు
- భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలి
- తీగలపల్లి రెవెన్యూ సదస్సును పరిశీలించిన కలెక్టర్




భూ భారతి రికార్డులను పరిశీలిస్తున్న దృశ్యం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్ 4 ప్రభాతవార్త:** భూ భారతి రెవెన్యూ సదస్సులో సమస్యల పరిష్కారానికి ఏర్పాటుచేసిన రెవెన్యూ సదస్సులో వచ్చే దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆదేశించారు. బుధవారం కోడేరు మండల పరిధిలోని తీగలపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సును అదనపు కలెక్టర్ రెవిన్యూ పి.అమరేందర్‌తో కలసి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సందర్శించారు. రెవెన్యూ సదస్సులో పెట్టిన భూ రికార్డులు, ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. గ్రామ ప్రజలకు దరఖాస్తు ఫారాలు ఒక రోజు ముందుగానే పంచార లేదా, గ్రామంలో రెవెన్య సదస్సును సద్వినియోగం చేసుకోవాలని టామ్ టామ్ చేశారా అని పంచాయతీ కార్యదర్శిని కలెక్టర్ ప్రశ్నించారు. షెడ్యూల్ ప్రకారం నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులపై ప్రజలకు ముందుగానే సమాచారం అందజేయాలని ఆదేశించారు. రెవెన్యూ సదస్సుకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అక్కడే పరిష్కరించదగిన వాటిని రెవెన్యూ సదస్సులోనే పరిష్కరించాలని తహసిల్దార్‌ను ఆదేశించారు. నోటీస్ ఇవ్వాల్సిన దరఖాస్తులకు వెంటనే నోటీస్‌లు జారీ చేసి గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. ప్రజలతో కలెక్టర్ మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నూతన భూభారతి రెవెన్యూ చట్టం 2025, రెవెన్యూ గ్రామసభలు ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ 20 వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని రెవెన్యూ గ్రామాలలో సదస్సులు నిర్వహించి భూ సమస్యలు ఉన్న రైతుల వద్ద నుండి దరఖాస్తులు స్వీకరించడం కోసం ఈ సదస్సులను ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఏర్పాటు చేయనైనదనీ, జిల్లా కలెక్టర్ అన్నారు. ఇప్పటికే స్థానిక తహసీల్దారులు పూర్తిస్థాయిలో సంబంధిత రెవెన్యూ గ్రామాలలో ప్రచారం నిర్వహించి ప్రజలను చైతన్య పరచామని, సమాచారం అందించడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతీ రోజు వచ్చిన దరఖాస్తుల స్థితిగతులను పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులను వినియోగించుకుని భూ సమస్యలను పరిష్కరించుకోవాలని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా ప్రజలను కోరారు. కలెక్టర్ వెంట కోడేరు తహసిల్దార్ విజయ్, ఇతర రెవెన్యూ అధికారులు తదితరులు ఉన్నారు.

## లోపభూయిష్టమైన

# ధరణి స్థానంలో భూభారతి

- ధరణి వల్ల కేసీఆర్ కుటుంబం బాగుపడింది
- భూభారతిలో రైతులకు సమన్యాయం
- కాంగ్రెస్‌ది రైతు సంక్షేమ ప్రభుత్వం
- కరివెన భూభారతి రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే




కరివెనలో భూభారతి రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీఎంఆర్

**భూత్పూర్, జూన్ 4, ప్రభాతవార్త :** గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి లోపభూయిష్టమైందని, ధరిణి వల్ల కేసీఆర్, ఆయన కుటుంబీకులు బాగుపడ్డారని దేవరకద్ర ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూధన్‌రెడ్డి(జీఎంఆర్) విమర్శించారు. ధరణి వల్ల సామాన్య రైతులకు సమన్యాయం జరగలేదని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి ప్రభుత్వమని పేర్కొన్నారు. గత పదేళ్ల కాలంలో రైతు బంధు తప్పా ఏ ఒక్క రైతు సంక్షేమ పథకం అమలు చేయలేదని విమర్శించారు. మూడున్నర ఎకరాల లోపు రైతుకు రైతు భరోసా, సన్న వడ్లపై రు.500బోనస్, పంట నష్ట పరిహారం వంటి రైతు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టిన 16నెలల్లో పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. కరివెన ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన ప్రతి రైతు కుటుంబాన్ని ఆదుకుంటానని, ఇంటికో ఉద్యోగం ఇస్తానని చెప్పిన మాజీ సీఎం కేసీఆర్ కరివెన ప్రజలకు చేసింది శూన్యమని విమర్శించారు. గత పాలకులు తమ స్వప్రయోజనాల కోసం ధరణిని ప్రవేశపెట్టి రైతుల్ని ముప్పతిప్పలు పెట్టారన్నారు.

**భూభారతి రైతుకు ఎంతో మేలు**

**భూత్పూర్ తహశిల్దార్ కిషన్ నాయక్**

ధరణిలో రైతులు ఎదుర్కొన్న ఇబ్బంధుల్ని దృష్టిలో ఉంచుకుని సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ధరణిని తొలగించి దాని స్థానంలో భూభారతి పేరిట కొత్త రెవెన్యూ చట్టాన్ని తీసుకువచ్చారని భూత్పూర్ తహశిల్దార్ కిషన్ నాయక్ స్పష్టం చేశారు. భూభారతిలో రైతుల నుంచి స్వీకరించిన ప్రతి ధరఖాస్తును పరిశీలించి పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. భూభారతి రైతులకు ఎంతో మేలు చేస్తుందని తహశిల్దార్ పేర్కొన్నారు.

**కరివెనలో హాస్టల్ ఏర్పాటుకు కృషి**

కరివెన చుట్టుప్రక్కల పలు గ్రామాల నుంచి విద్యార్థిని విద్యార్థులు సరైన సౌకర్యాలు లేక చదువుల పట్ల శ్రద్ధ చూపలేకపోతున్నట్లు తమదృష్టికి వచ్చిందని, విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కరివెనలో ప్రభుత్వ హాస్టల్ ఏర్పాటుకు తనవంతు కృషిచేస్తానని ఎమ్మెల్యే జీఎంఆర్ స్పష్టం చేశారు. మండలకాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన భూభారతి రెవెన్యూసదస్సులో తహశిల్దార్ కిషన్ నాయక్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్, మాజీ ఎంపిపి కదిరే పాటు నాయకులు మండల యువజనే కాంగ్రెస్ అధ్యక్షుడు రేకులపాటి భూపతిరెడ్డి, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు హరియా నాయక్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు రావులపల్లి మొల్గర నర్సింహులు ఇతరనాయకులు అశోక్‌రెడ్డి, తిరుపతి రెడ్డి, మాధవరెడ్డి, కిట్టురెడ్డి, వడ్డె శ్రీనివాసులు, ఆర్ఐ వెంకటేష్, నర్సింహులు, వెంకటేష్ తది తరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలి :ఆర్డీవో శీను నాయక్

**కల్వకుర్తి, జూన్ 4 ప్రభాతవార్త:**రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కల్వకుర్తి మండలంలో 2వ రోజులు ఆర్డీఓ శ్రీనునాయక్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు కొనసాగుతున్నాయి. అందులో భాగంగా లింగసానిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో ఆర్డీవో శీను నాయక్ పాల్గొని మాట్లాడుతూ రైతులకు తమ భూములకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అక్కడే రైతులకు దరఖాస్తులను పరిశీలించి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి 28 దరఖాస్తులు వచ్చాయని, ఆదే విధంగా వెంకటాపురం గ్రామంలోని రెవెన్యూ సదస్సులో 5 దరఖాస్తులు వచ్చాయని తహశీల్దార్ ఇబ్రాహీం, డిప్యూటీ తహశీల్దార్ రాఘవేందర్ తెలిపారు. అదే విధంగా గురువారం మండలంలోని తోటపల్లి, పంజుగుల గ్రామాల్లోని రైతు వేదికల వద్ద రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ ఇబ్రాహీం కోరారు. ఈ సదస్సుల్లో రైతులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్డీఓ శ్రీనునాయక్

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

**-భూత్పూర్ పీహెచ్‌సీ ఎంఓ డాక్టర్ మొహ్మద్ అబ్దుల్ రబ్**

**భూత్పూర్,జూన్ 4,ప్రబాతవార్త :** రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని,తద్వారా సంభవించే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత ఎంతో అవసరమని భూత్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) మెడికల్ ఆఫీసర్(ఎంఓ) డాక్టర్ మొహ్మద్ అబ్దుల్ రబ్ అన్నారు.బుధవారం పీహెచ్‌సీలో మండల స్థాయి టాస్క్ ఫోర్స్ అత్యవసర సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ రబ్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల్లో ముఖ్యంగా మలేరియా,డెంగ్యూ,,చికెన్‌గున్యా వంటి ప్రాణాంతక వ్యాధులు సంభవించే ఆస్కారమున్నందున ఆరోగ్య సిబ్బంధి,ఆశవర్కర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.పట్టణ,రూరల్ ప్రాంతాలలో సీజనల్ వ్యాధులు సోకకుండా మున్సిపల్ కమిషనర్,ఎంపీడీఓ తమకు ఎప్పటికప్పుడు సమాచారం అందివ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నూరుల్ నజీబ్,ఎంపీడీఓ ప్రభాకర్‌చారి,హెచ్ఎ శ్రీనివాసులు ఇతర వైద్య సిబ్బంధి పాల్గొన్నారు.

## రైతులకు రాయితీ విత్తనాలు అందుబాటులో..

**-పీఏసీఎస్ చైర్మన్ తలసాని జనార్దన్ రెడ్డి**

**కల్వకుర్తి, జూన్ 4 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని పీఏసీఎస్ గోదాం కాంప్లెక్స్‌లో రైతులకు రాయితీ విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని పీఏసీఎస్ చైర్మన్ తలసాని జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులు డిఏపి 20.20.0.13, 28.28.0, పోటాష్, 14.35.14. యూరియా అందుబాటులో ఉన్నాయని, వరి విత్తనాలు బీపీటీ, పచ్చి రొట్టె విత్తనాలు, జీలుగా, జనుములు, మొక్కజొన్న విత్తనాలు అందుబాటులో ఉన్నాయాని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నాణ్యమైన ఎరువులు, విత్తనాలు తీసుకోవాలని కల్వకుర్తి పీఏసీఎస్ ఛైర్మెన్ తలసాని జనార్దన్ రెడ్డి, సీఈఓ వెంకట్‌రెడ్డిలు తెలిపారు.

## శోభాయమానంగా గ్రామదేవతల స్థాపన

**ఆత్మకూర్ జూన్ 4. ప్రభాతవార్త:** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో నూతనంగా నిర్మించినటువంటి గ్రామదేవతల ఆలయాలలో ఆయా గ్రామ దేవతలను బుధవారం రోజు వేదమంత్ర చరణాల మధ్య పూజారులు భక్తిశ్రద్ధలతో ప్రతిష్ట చేశారు. పట్టణంలో నూతనంగా నిర్మించినటువంటి పోచమ్మ దేవాలయం, కట్ట మైసమ్మ దేవాలయం, భూ లక్ష్మమ్మ దేవాలయం, కగ్రెమ్మదేవాలయంతో పాటుగా మంగళవారం నుండి కొనసాగుతున్న దేవతామూర్తుల శోభాయాత్రలోతో మొదలుకొని బుధవారం రోజు పోచమ్మ దేవాలయం నుండి మొదలైన విగ్రహాల ప్రతిష్టాపన క్రమేపి సాయంత్రం వరకు గ్రామదేవతలను ప్రతిష్టింప చేశారు. అంతేకాకుండా గురువారం రోజు పట్టణంలో విశిష్టంగా నిర్వహిస్తున్న బుడ్రాతి పండుగకు సంబంధించి ఆలయాల నిర్వహణ కమిటీ కన్వీనర్ శ్రీధర్ గౌడ్ ప్రత్యేక ఏర్పాట్లను చేయించారు. బుధవారం రోజు జరిగిన గ్రామదేవతల విగ్రహ ప్రతిష్టాపనలో ఆత్మకూరు మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ గాయత్రి రవికుమార్ యాదవ్ టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రవికుమార్ యాదవ్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో పట్టణంలోని ప్రముఖులతో పాటుగా రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


విగ్రహ ప్రతిష్టాపన లో మున్సిపల్ మాజీ చైర్మన్

## రెవెన్యూ సదస్సును సద్వినియోగం చేసుకోండి

**మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మళ్ళ అశ్విని**

**బాలానగర్,జూన్4 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో బుధవారం భూభారతి రెవెన్యూ సదస్సులలో భాగంగా తహసిల్దార్ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మార్కెట్ కమిటీ చైర్మన్ అశ్విని హాజరయ్యారు.ఈసందర్భంగా ఆమెమాట్లాడుతూ రైతులు తమ యొక్క భూ సమస్యలను ఫారంలో వివరాలు పొందుపరిచి రెవెన్యూ సదస్సులో ఇస్తే, వారి సమస్యలను సిబ్బంది పరిష్కరిస్తారని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. మండలంలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈరోజు మండల కేంద్రంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 20దరఖాస్తులు వచ్చినట్లు తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శంకర్ నాయక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, రాజేశ్వర్ రెడ్డి,సతీష్,శ్రీకాంత్,చంటి పాల్గొన్నారు.


దరఖాస్తులను స్వీకరిస్తున్న తహసిల్దార్

## భూ సమస్యలపై రైతుల అర్జీలు

**తహసీల్దార్ ప్రమీల**

**ఉప్పునుంతల, జూన్ 4 ప్రభాతవార్త :** భూభారతి చట్టం అమలులో భాగంగా రెండవ రోజైనా బుధవారం మండలంలోని లత్తీపూర్, తిరుమలాపూర్ గ్రామాలలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి అర్జీలను తహసీల్దార్ ప్రమీల,ఉప తహసీల్దార్ పరుష్ నాయక్‌లో ఆధ్వర్యంలో స్వీకరించారు. మండలంలో రెండు టీంలుగా ఏర్పడి ఒక టీం తహసీల్దార్ ప్రమీల ఇంఛార్జిగా వ్యవహరిస్తున్నారు. మరో టీం ఉప తహసీల్దార్ పరుష్ నాయక్ ఆధ్వర్యంలో సదస్సులు కొనసాగుతున్నాయి. భూ సమస్యలకు సంబంధించి అర్జీలు అధికంగా వస్తున్నట్లు తహసీల్దార్ వివరించారు. ఎన్నో రోజుల నుంచి పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు సంబంధించి అర్జీలు రావడంతో పరిష్కరించే మార్గంలో ఉన్నామని తహసీల్దార్, ఉప తహసీల్దార్ వివరించారు. తహసీల్దార్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు పెనిమిళ్ళ, లత్తిపూర్‌లో జరిగిన రెవెన్యూ సదస్సులకు 117 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ ప్రమీల వివరించారు. మొదటి రోజు ఉప్పరి పల్లి లో 32 దరఖాస్తులు రాగా, రెండో రోజైన బుధవారం తిరుమలాపూర్ లో 30 దరఖాస్తులు వచ్చినట్లు ఉప తహసీల్దార్ పరుష్ నాయక్ వివరించారు. ఈ సదస్సులో తహసీల్దార్ ప్రమీల,ఉప తహసీల్దార్ పరుష్ నాయక్‌తో పాటు రెవెన్యూ ఇన్స్పెక్టర్ సుజాత, సీనియర్ అసిస్టెంట్ బాల్‌రాం నాయక్, జూనియర్ అసిస్టెంట్ అబ్రహార్, సిబ్బంది ఆదిత్య, శంకర్, రమణమ్మ, స్వప్న, శివ, లత్తిపూర్ మాజీ సర్పంచ్ మల్లేష్, శేఖర్ యాదవ్ రైతులు, ప్రజలు పాల్గొన్నారు. నేడు భూభారతి చట్టంపై మండలంలోని కొరటికల్, జప్తి సదగోడులో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ప్రమీల తెలిపారు. ఈ సదస్సులకు భూ సమస్యలకు సంబంధించిన రైతులు తమ సమస్యలపై అర్జీలను పెట్టుకోవాలని తెలిపారు.

## ఆర్గనైజర్ల వ్యవస్థను చట్టబద్ధం చేయాలి

**మల్దకల్, జూన్ 4 ,ప్రభాతవార్త ;** మల్దకల్ మండలం బుధవారం రైతు వేదికలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నూతన విత్తన చట్టం 2025 ముసాయిదా తయారీకై చేసిన కమిటీ సభ్యులతో రైతులకి సమావేశం నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా విత్తనోత్పత్తి చేస్తున్న రైతులకు తగిన గిట్టుబాటు ధర చెల్లిస్తే ఈ నాణ్యత ప్రమాణాలు పాటించవచ్చును. ఆర్గనైజర్లు వ్యవస్థను చట్ట బద్ధం చెయ్యాలి.రైతులతో పండిస్తున్న వారికి కనీస విద్యార్హతలను పెట్టాలి , వారికి లైసెన్స్ ప్రభుత్వం ఇవ్వాలి మొదలగు అంశాలపై కమిటీ సభ్యుడు అయిన తెలంగాణ రాష్ట్ర విత్తనాభ్రువృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి, కమిటీ సభ్యుడు డి.నర్సింహ రెడ్డి రైతులతో చర్చించారు. అదేవిధంగా ఇంకేమైనా సలహాలు సూచనాలు ఉన్న మండల వ్యవసాయ కార్యాలయంలో తెలియజెయ్యాలని మండల వ్యవసాయ అధికారి తెలియజేశాడు. ఈ కార్యక్రమం లో భాగంగా ఎం. అదినారాయణ రెడ్డి, డి ఏం, వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ ప్రధాన కార్యదర్శి జి. నరసింహులు, ఈ పద్మ, మండల వ్యవసాయ విస్తరణ అధికారులు , రైతులు పాల్గొన్నారు.

# భూత్పూర్ మున్సిపాలిటీలోని వార్డుల అభివృద్ధికి రూ.3కోట్లు

- ఒక్కో వార్డుకు రు.30లక్షలతో ఇంటర్నల్ రోడ్లు,డ్రైనేజీల నిర్మాణాలు
- మున్సిపాలిటీలో ఆరంభమైన వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక
- ఈ నెల 3నుంచి అట్టహాసంగా ఆరంభమైన కార్యాచరణ పనులు

**భూత్పూర్,జూన్ 4,ప్రభాతవార్త :** దేవరకద్ర ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూధన్‌రెడ్డి(జీఎంఆర్) భూత్పూర్ మున్సిపాలిటీకి వరాల జల్లు కురిపించారు.ఎమ్మెల్యే చొరవతో సీఎం రేవంత్‌రెడినడ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం భూత్పూర్ మున్సిపాలిటీలోని పదివార్డుల అభివృద్ధికి పనులకు రు.3కోట్ల నిధులు మంజూరు చేసింది.ఎమ్మెల్యే జీఎంఆర్ ఆదేశాల మేరకు మున్సిపాలిటీ ఒక్కో వార్డుకు రు.3లక్షల చొప్పున కేటాయిస్తూ వార్డులలో ఇంటర్నల్ రోడ్ల నిర్మాణాలు,డ్రైనేజీ నిర్మాణాలు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ నూరుల్ నజీబ్ తెలిపారు.తొలిరోజు మంగళవారం తొమ్మిదోవార్డు బీసీకాలనీ డ్రైనేజీ పనులు చేపట్టారు.మరుసటి రోజు బుధవారం భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఆరోవార్డు అమిస్తాపూర్ ఎస్సీ కాలనీలో కమిషనర్ నూరుల్ నజీబ్‌తో పాటు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్‌ల నేతృత్వంలో మున్సిపల్ పరిశుద్ధ్య సిబ్బంధి,పబ్లిక్ హెల్త్ ఈఓ వినోద్‌తో పాటు వర్క్స్ ఇన్స్‌స్పెక్టర్ ఇతర సిబ్బంధి పాల్గొని అమిస్తాపూర్ ఆరో వార్డు ఎస్సీకాలనీలో విస్తృతంగా పర్యటించి రోడ్లు,డ్రైనేజీల కోసం చేపట్టే కొత్త నిర్మాణాలను పరిశీలించారు.కమిషనర్ స్వయంగా మైక్‌లో 'మీ కోసం మేం వచ్చాం..మీ ఊరు కోసం మీరొస్తారా..? అంటూ అనౌన్స్ చేస్తూ వార్డులో పర్యటించారు.ఈ కార్యక్రమంలో మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పద్మమ్మతో పాటు నాయకులు మశ్చేందర్,మట్టి ఆనంద్,బాలవర్ధన్‌రెడ్డి,పవన్, శివరాములు, మాజీ సర్పంచి చెన్నమ్మ,కృష్ణయ్య,చెన్నయ్య,మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.భూత్పూర్ మున్సిపాలిటీ అభివృద్ధి పనుల కోసం రు.3కోట్ల నిధులు కేటాయించి,మంజూరు చేయించిన ఎమ్మెల్యే జీఎంఆర్‌కు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.


అమిస్తాపూర్ ఆరోవార్డులో పర్యటిస్తున్న మున్సిపల్ కమిషనర్ నూరుల్ నజీబ్,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్ తదితరులు

## గద్వాల చేనేత కార్మికులను ప్రోత్సహించడానికి వీ హబ్ : డీకే స్నిగ్ధ రెడ్డి

**గద్వాల,జూన్ 4,ప్రభాతవార్త:** గద్వాల చేనేతకు కొత్త కళ,గుర్తింపును వి హబ్ ఫౌండేషన్ ద్వారా తీసు కొచ్చేందుకు బీజేపీ యువ నాయకురాలు డీకే స్నిగ్ధ రెడ్డి శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా మహిళ కార్మికులకు సామర్థ్యాభివృద్ధి కోసం బుధవారం డికె. స్నిగ్ధ రెడ్డి ద్వారా వీ హబ్ సీఈఓ సీత పల్లచోల్ల జిల్లా కలెక్టర్ సంతోష్ ను కలిశారు. జోగులాంబ గద్వాల హ్యాండ్లూమ్స్ నీ ప్రోత్సహించడానికి, జిల్లాలోని మహిళా చేనేత కార్మికుల సామర్థ్యవృద్ధి, ఆర్థిక, డిజిటల్ సాక్షరత, మార్కెట్ లింకేజ్‌లు, వ్యవస్థాగత సమన్వయం ద్వారా ఉజ్వలమైన జీవనోపాధి, అధిక రెవెన్యూ జనరేషన్ అవకాశాలను అందించేందుకు వీ హబ్‌ఫౌండేషన్ ప్రాజెక్ట్ "సూత్రిక"ద్వారా అమలు చేయనున్నది. ఈనేపథ్యంలో వీహబ్ సీఈఓ సీత పల్లచోల్ల, సోషల్ ఇంపాక్ట్ అండ్ ఎంట్రప్రెన్యూర్షిప్ టీమ్ జిల్లాకలెక్టర్ సంతోష్‌ని మర్యాదపూర్వకంగా కలిసి, ప్రాజెక్టు లక్ష్యాలు, కార్యాచరణ ప్రణాళిక వివరాలు చర్చించడం జరిగిందని స్నిగ్ధ రెడ్డి తెలిపారు.జిల్లాలోని గద్వాల్ చేనేత క్లస్టర్లను ఆధారంగా చేసుకొని ఆర్టిసన్ కలెక్టివ్స్ ఏర్పాటు, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు, డిజిటల్ మార్కెటింగ్, మార్కెట్ యాక్సెస్, సోషల్ సెక్యూరిటీ ఫైనాన్షియల్ లింకేజులపై కీలక విషయాలు చర్చించారు. ప్రాజెక్టు విజయవంతంగా అమలు కావడానికి జిల్లా అధికారులు, సంబంధిత శాఖల మద్దతును కోరారు. ఆర్టిసన్ గుర్తింపు, సంఘటితం చేయడం, ప్రభుత్వ పథకాలను సమన్వయపరిచే దిశగా సహకారం కోరారు. ఈ ప్రాజెక్టు ద్వారా గద్వాల్ చేనేత కళకు కొత్త గుర్తింపు లభించే అవకాశముందని వీ హబ్ సీ ఈ ఓ తెలిపారు. ఈకార్యక్రమంలో వీహబ్ డైరెక్టర్ జాహిద్ షేక్, అసోసియేట్ డైరెక్టర్ ఊహ సజ్జ పాల్గొన్నారు.


జిల్లా కలెక్టర్‌ను కలిసిన వి హబ్ సీఈఓ పళ్ళ చోళ్ల సీత, డీకే స్నిగ్ధ రెడ్డి

## దరఖాస్తు చేసుకున్న ప్రతి నిరుద్యోగికి సాయం అందించాలి

**అమరచింత జూన్ 4 ప్రభాతవార్త:** నిరుద్యోగులకు ఇస్తున్న రాజీవ్ యువ వికాస్ పథకానికి దరఖాస్తు చేసిన ప్రతి నిరుద్యోగి కి రాష్ట్ర ప్రభుత్వం సహాయం అందించాలని అఖిలభారత యువజన సంఘం జిల్లా కార్యదర్శి ఎం.డి. కుతుబ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన అమరచింత మండల కేంద్రంలోని నాలుగో వార్డులో స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా,కుతుబ్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యువతను భీముల పేరుతో మధ్యపెడుతూ మోసం చేస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిరుద్యోగులకు ఇస్తానన్న రాజు యువ వికాసానికి అనేక కొర్రీలు పెట్టిందని ఆరోపించారు. లక్షా రెండు లక్షలు మూడు లక్షలు నాలుగు లక్షలకు దరఖాస్తు చేసుకున్న ప్రతినిధికి ఈ స్కీమ్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. మొదటగా లక్ష మందికి ఇస్తామని జూన్ రెండవ తేదీని ప్రకటించి అది కూడా వాయిదా వేయడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసానికి దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరిని పరిగణలోకి తీసుకొని వారు దరఖాస్తు చేసుకున్న యూనిట్ ప్రకారం ఆర్థిక సాయం అందజేయాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఈఐవైఎఫ్ నాయకులు అనురాగ్, చేతన్, ఆదర్శ, తేజ, విశాల్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.డి. కుతుబ్

## కొండేరు భూరెవిన్యూ సదస్సులో 17 దరఖాస్తులు

**ఇటిక్యాల, జూన్ 4 ప్రభాతవార్త :** భూభారతి చట్టం ద్వారా గ్రామీణ ప్రాంతాలలో భూ సమస్యలు నిన్న రైతుల సమస్యలు తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయ అలాగే జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్ ఆదేశాల మేరకు బుధవారం మండల పరిధిలోని కొండేరు గ్రామంలో రెండవ రోజు నిర్వహించిన భూ రెవెన్యూ సదస్సుకు వివిధ రకాల భూ సమస్యల కొరకు 17 దరఖాస్తులు వచ్చినట్లు ఎర్రవల్లి మండల ఇంఛార్జిగా ఉన్న ఇటిక్యాల డిప్యూటీ తహసీల్దార్ నందిని తెలిపారు. రైతులు ఇచ్చిన దరఖాస్తులకు రసీదులు అందజేసినట్లు అలాగే దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు డిప్యూటీ తాహసిల్దార్ నందిని తెలిపారు. ఈ సందర్భంగా కొండేరులో జరిగిన రెవెన్యూ సదస్సుకు అల్లంపూర్ మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడ్డప్ప పాల్గొని కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుడు పోతురాజు సోమనాద్రితో కలిసి రైతుకు చెందిన దరఖాస్తును రెవిన్యూ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడ్డప్ప మాట్లాడుతూ భూభారతి చట్టం ద్వారా భూ సమస్యలను పరిష్కరించేందుకు గాను రెవెన్యూ సదస్సులను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని రైతులు సదస్సులలో ఇచ్చిన ప్రతి భూ సమస్యను ప్రభుత్వం పరిష్కరిస్తుందని గ్రామాలలో జరిగే భూ సమస్యలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని చైర్మన్ కోరారు. రెవెన్యూ సదస్సులో సీనియర్ అసిస్టెంట్ నరేష్, ఆర్. ఐలు షంషీర్, శ్రీనివాసులు, కార్యాలయ జూనియర్ అసిస్టెంట్లు, కార్యాలయ సిబ్బంది గ్రామపంచాయతీ కార్యదర్శి రాజు. ఏఈఓ ప్రవళిక, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


కొండేరులో జరిగిన రెవెన్యూ సదస్సులో రైతుతో కలిసి దరఖాస్తును రెవెన్యూ అధికారులకు అందజేస్తున్న మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడ్డప్ప

## రైతులకు పంటలపై వ్యవసాయ శాస్త్రవేత్తల అవగాహన

**అమరచింత, జూన్ 4,ప్రభాతవార్త:** తక్కువ పెట్టుబడి తో పాటు ఎక్కువ లాభాలు పొందాలని లక్ష్యంతో తక్కువ కళాపరిమితి కలిగి ఉండి అధిక దిగుబడి తీసుకోవడానికి ఐ సి హెచ్ 5 హైబ్రిడ్ ఆముదాల రకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ సురేష్, డాక్టర్ అనిత వ్యవసాయ రైతులను కోరారు. బుధవారం అమరచింత మండలంలోని పామిరెడ్డిపల్లి, కుంకనోని పల్లె గ్రామాల రైతులకు వికాసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రైతులు ఒకే రకం సాగుపై ఆధారపడకుండా రైతులు తమ పంట పొలాలలో ఆయిల్ ఫామ్ సాగు చేయడం వల్ల రైతులు ఎక్కువ లాభాలు పొందే అవకాశం ఉందని ప్రతి రైతు మొగ్గు చూపాలని ఆయన రైతులను కోరారు. వానాకాలం పంటల రైతులు నాణ్యమైన విత్తనాలను వినియోగించాలని ఆయన రైతులను కోరారు. అలాగే రైతుల సలహాలను వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిగణంలోకి తీసుకొని రైతులకు పంటలపై సలహాలు ఇచ్చారు. ఐ సి హెచ్ 5 అనే హైబ్రిడ్ ఆముదం రకం విత్తనాలు కే వి కే మదనాపురం సెంటర్లో విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని అవసరం ఉన్న రైతులు తీసుకువెళ్లాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి, అరవిందు, మండల వ్యవసాయ విస్తరణ అధికారి, శివకుమార్, రైతులు పాల్గొన్నారు.


అమరచింత మండలంలో కొంకనివాని పల్లె గ్రామంలో రైతులకు పంటల పై వ్యవసాయ శాస్త్రవేత్తలు అవగాహన

## కార్మికుని కుటుంబానికి ఉపాధ్యాయుల ఆర్థిక సహాయం

**భూత్పూర్,జూన్ 4,ప్రభాతవార్త :** భూత్పూర్ పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన వంట కార్మికుడు అనువ చంద్రశేఖర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గత నెల 28న మృతిచెందాడు.మృతుడి కుటుంబాన్ని ఆదుకునేందుకు మానవత్వంతో స్పందించిన పాఠశాల హెచ్ఎం దస్తయ్యతో పాటు పీఆర్‌టీయు టీఎస్ భూత్పూర్ మండల శాఖ అధ్యక్షుడు సత్తూర్ బాల్‌రాజ్‌గౌడ్ చొరవ చూపి ఉపాధ్యాయులతో సంప్రదించి రు.లక్ష ఆర్థిక సహాయం అందించారు.పాఠశాల హెచ్ఎం దస్తయ్యతో పాటు ఉపాధ్యాయులు యాదయ్య,పద్మమ్మ,పద్మావతి,సాయి రమాదేవి,నీరజ,నాగజ్యోతితో పాటు అటెండర్ జ్ఞానేశ్వర్‌లు కలిసి రు.50వేలు ప్రోగుచేశారు.ఇదేవిధంగా మండల పీఆర్‌టీయు టీఎస్ అధ్యక్షుడు సత్తూర్ బాల్‌రాజ్‌గౌడ్ సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కొప్పోలు యాదయ్యలు మండలంలోని ఉపాధ్యాయుల నుంచి సేకరించిన రు.50వేలను మొత్తం రు.లక్షను బుధవారం యూనియన్ జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్,గౌరవాధ్యక్షుడు బుచ్చా రెడ్డిల చేతుల మీదుగా మృతుని భార్య అమృతమ్మకు అందజేశారు.ఈ సందర్భంగా యూనియన్ జిల్లా భాధ్యులు మాట్లాడుతూ తమ యూనియన్ నాయకులు సత్తూర్ బాల్‌రాజ్‌గౌడ్,కొప్పోలు యాదయ్యల సహకారంతో మండల యూనియన్ ఉపాధ్యాయులను సమన్వ య పరిచి విరాళం సేకరించి మానవత్వంలో మృతుని కుటుంబాన్ని ఆదుకునే ప్రయత్నం చేయడం హర్షింపతగ్గ అంశమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా యూనియన్ మండల అధ్యక్షుడు సత్తూర్ బాల్‌రాజ్‌గౌడ్,రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కొప్పోలు యాదయ్యతో పాటు మానవత్వంతో స్పందించి ఆర్థిక సహాయం అందించిన మండల ఉపాధ్యాయులందరికి యూనియన్ జిల్లా నేతలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



## 20 క్వింటాళ్ల పిడిఎస్ రైస్ పట్టివేత, కేసు నమోదు: నర్వ ఎస్ఐ


పిడిఎస్ రైస్‌ను పట్టుకున్న దృశ్యం

**నారాయణ పేట, జూన్ 4 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా నర్వ మండల పరిధిలోని పోలీస్ సిబ్బంది నమ్మదగిన సమాచారం మేరకు పెద్దకడుమూరు గ్రామంలో ఎరుకలి నరసింహ ఇంట్లో తనిఖీ చేయగా ప్రభుత్వం పేదలకు సరఫరా చేసే రేషన్ బియ్యం లబ్ధిదారుల నుంచి సేకరించి 20 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యంను అక్రమంగా తన ఇంట్లో నిల్వ ఉంచుకోవడం జరిగింది. తర్వాత డిటి పంచనామా నిర్వహించి బియ్యంను సీజ్ చేసి నరసింహపై కేసు నమోదు చేసి తదుపరి విచారణ జరుగుతుంది అని ఎస్సై కుర్మయ్య తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం పేదలకు సరఫరా చేసి రేషన్ బియ్యంను లబ్ధిదారుల నుంచి సేకరించిన మరియు రవాణా చేసిన కేసులు నమోదు జరుగుతాయని ఎస్సై తెలిపారు.

## సైబర్ నేరాలపై యువతకు అవగాహన

**బాలానగర్,జూన్4 ప్రభాతవార్త:**సైబర్ నేరాలపై ప్రజలు అవ గాహన కలిగిఉండాలని బాలానగర్ ఎస్సై లెనిన్ అన్నారు. బుధవారం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద సైబర్ క్రైమ్‌పై యువతకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మొబైల్ ద్వారానే 80శాతం సైబర్‌నేరాలు జరుగుతున్నాయని, సాంకేతికతను ఆసరాగా చేసుకుని సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని విద్యార్థులు,యువత అవగాహన పెంచుకుని ఏటువంటి మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.మొబైల్ వినియోగదారులు అపరిచిత వ్యక్తులకు ఓటిపి, వ్యక్తిగత సమాచారం ఇవ్వకూడదన్నారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోస పోతే సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐతో పాటు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## బండల శ్రీ సోమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేసిన డీకే స్నిగ్ధ రెడ్డి


ప్రత్యేక పూజలు నిర్వహించిన డీకే స్నిగ్ధ రెడ్డి

**గద్వాల జూన్ 4,ప్రభాతవార్త:** గద్వాల మండలంలోని లత్తిపురం గ్రామంలో బండల శ్రీ సోమేశ్వర స్వామి, శ్రీ చౌడేశ్వరి దేవి ఉత్సవాల సందర్భంగా బీజేపీ యువ నాయకురాలు డీకే స్నిగ్ధ రెడ్డి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించినారు. డీకే స్నిగ్ధా రెడ్డి కి లత్తిపురం గ్రామ ప్రజలు ముందుగా శాలువతో ఘనంగా సత్కరించారు.ఈకార్యక్రమంలో బిజెపి జిల్లాఅధ్యక్షుడు రామాంజనేయులు, మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, బిజెపి నాయకులు బాలేశ్వర్ రెడ్డి,లత్తి పురం రామిరెడ్డి, మధుసూదన్ రెడ్డి , అశోక్ రెడ్డి, రాజు యాదవ్,పరుష తదితరులు ఉన్నారు.

## పశువులకు టీకాలు

**మల్దకల్, జూన్ 4,ప్రభాతవార్త :** మల్దకల్ మండల పరిధి లోని బుధవారం నాడు పెద్దపల్లి బూడిదిపాడు గ్రామాల్లో ముద్ద చర్మ వ్యాధి నివారణ టీకాలు వేయడం జరిగింది. తేదీ 25.06.2025 వరకు పశు వైద్య సిబ్బంది అన్ని గ్రామాలలోని పశువులకు టీకాలు వేస్తారు. కావున రైతులు ప్రభుత్వం ఉచితంగా వేయబడుతున్న ముద్ద చర్మ వ్యాధి నివారణ టీకాలను వేయించుకోవాలని పాల్వాయి పశువైద్యాధికారిని డాక్టర్ ఉష తెలిపారు.ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది గోవర్ధన్, రాముడు, మధు మరియు రైతులు పాల్గొన్నారు.

## ఆర్సీబీ గెలుపు సంబరాలు

**బాలానగర్, జూన్ 4 ప్రభాతవార్త :** ఇండియన్ ప్రీమియర్ లీగ్ ఫైనల్ మ్యాచ్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు గెలవడంతో బాలానగర్ మండల కేంద్రంలో బుధవారం ఆర్సిబి అభిమానులు కేరింతలు కొడుతూ సంతోషం వ్యక్తం చేశారు. పెద్దాయపల్లి చౌరస్తా నుండి బాలానగర్ మండల కేంద్రం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. భారీ కేక్ కట్ చేసి ఒకరికి ఒకరు తినిపించుకుని సంబరాలు చేసుకున్నారు. 18వ సీజన్లో ఆర్సిబి ఐపీఎల్ విజేతగా నిలిచిందన్నారు. బి.శ్రీనివాస్‌రెడ్డి,పవన్‌రెడ్డి,శ్రీకాంత్ నాయక్, శ్రీశైలం పెద్ద ఎత్తున ఆర్సిబి అభిమానులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకి ఆర్థిక సహాయం

**వడ్డేపల్లి,జూన్4 ప్రభాతవార్త:** వడ్డేపల్లి మున్సిపాలిటీ కేంద్రమైన శాంతినగర్ పట్టణంలోని ఎదవ వార్డు జమ్మలమడుగు కాలనీకి చెందిన కురువ నారాయణ కుమారుడు వెంకటేష్ (40) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం చనిపోవడంతో అలాగే వడ్డేపల్లిలోని ఆరో వార్డుకు చెందిన బోయ సంజన్న క్యాన్సర్ వ్యాధితో కొంతకాలంగా బాధపడుతూ చనిపోవడం జరిగింది. విషయం తెలుసుకున్న వడ్డేపల్లి మున్సిపాలిటీ మాజీ చైర్పర్సన్ ఆర్ ఎస్ కరుణ భర్త వడ్డేపల్లి సూరి మృతుల గృహాలకి వెళ్లి భౌతికాయలకి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబాల సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా దహనఖర్చుల నిమిత్తం మృతులకుటుంబసభ్యులైన కురువనారాయణకు రూ.5వేలు, మృతుడు బోయసం జన్న కుటుంబసభ్యులకు రూ.5వేలు ఆర్థికసాయం అందించారు.

